# COMMUNIST PARTY OF INDIA (MARXIST)
## Telangana State Committee
M.B.Bhavan, H. No.1-1-60/2, RTC 'X' Roads, Hyderabad -20.
Ph. 040- 27665011 /12, Fax : 27665013, Email-cpimtelangana@gmail.com


ప్రచురణార్థం/ ప్రసారార్థం: తేది: 11.11.2022

## పేదల గుడిసెలు తొలగించడం అమానుషం
## అక్రమంగా పెట్టిన కేసులు ఎత్తివేయాలి
## ఇల్లు కట్టుకోవడానికి రు.5లక్షలు మంజూరు చేయాలి

రంగారెడ్డి జిల్లా కందుకూరు మరియు నాగర్‌కర్నూల్ జిల్లా ఎత్తం గ్రామంలో గత ప్రభుత్వాలు పేదలకు ఇంటి పట్టాలిచ్చి స్థలాలు చూపలేదు. పట్టాలున్న నిరుపేదలు ప్రభుత్వ స్థలంలో గుడిసెలు వేసుకుంటే అట్టి గుడిసెలను తొలగించి, అక్రమంగా అరెస్టులు చేసి, పోలీసు స్టేషన్లల్లో నిర్బంధించి కేసులు పెట్టడాన్ని సీపీఐ(ఎం) తెలంగాణ రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండిస్తున్నది. తక్షణమే ఈ స్థలంలోనే ఇల్లు కట్టుకోవడానికి స్థలంతో పాటు, ఒక్కో కుటుంబానికి రు.5లక్షలు మంజూరు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నది.

రంగారెడ్డి జిల్లాలో మంత్రి సబితా ఇంద్రారెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న మహేశ్వరం నియోజకవర్గంలోని కందుకూరు మండల కేంద్రం సర్వేనం.788లో 5.20 ఎకరాల్లో 183 మంది నిరుపేదలకు 60 గజాల చొప్పున 2007లో అప్పటి ప్రభుత్వం పేదలకు ఇంటి స్థలాలకు పట్టాలిచ్చి, స్థలం చూపలేదు. ఇట్టి స్థలాన్ని కొంత మంది అక్రమంగా అమ్మేందుకు ప్రయత్నిస్తున్నారు. దీంతో450 మంది పట్టాలున్నవారితో పాటు, ఇండ్లు లేనివారు గుడిసెలు వేసుకుని అక్కడే నివసిస్తున్నారు.

నాగర్‌కర్నూల్ జిల్లాలో హర్షవర్ధన్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కొల్లాపూర్ నియోజకవర్గంలోని కోడేరు మండలం ఎత్తం గ్రామంలోని సర్వేనం.289, 334లో 11.33 ఎకరాల్లో 1996లో 201 మందికి ప్రభుత్వం పట్టాలిచ్చి, స్థలం చూపలేదు. ఇట్టి స్థలంలో రైతువేదిక, కరెంట్ జంక్షన్, నర్సరీను 1.20 ఎకరాల్లో నిర్మించుకున్నారు. మిగిలిన స్థలంలో పట్టాలున్నవారే గుడిసెలేసుకున్నారు.

పై రెండు కేంద్రాల పేదలు అనేక ఉద్యమాలు, పోరాటాలు చేయడంతో పాటు, పలుమార్లు అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం లేకపోవడంతో ఆ ప్రభుత్వ స్థలాల్లో గుడిసెలు వేసుకున్నారు. ఇట్టి గుడిసెలను నవంబర్ 10 తెల్లవారు జామున వందలాది మంది పోలీసులు జేసీబీలతో తొలగించారు. మహిళలపై దాడులు చేసారు. కందుకూరులో సీపీఐ(ఎం) నాయకులను అరెస్టులు చేసారు. ఎత్తం గ్రామంలో సీపీఐ(ఎం) నాయకులు బి శ్రీనివాస్, ఎంపీటీసీ శ్రీనివాసరావుతో పాటు మరోఇద్దరిపై అక్రమంగా 307 కేసు నమోదు చేసారు. ఎంపీటీసీని జైలుకు పంపారు. అదే విధంగా పోలీసులను అడ్డుకున్నారని గ్రామ సర్పంచ్ వరలక్ష్మితో సహా, నాయకులపై మరియు గుడిసెవాసులపై అక్రమంగా కేసులు పెట్టారు. రెండు కేంద్రాల్లో పోలీస్ పికెట్ పెట్టి ఇట్టి స్థలాల్లోకి పేదలు వెళ్ళకుండా అడ్డుకుంటూ భయప్రభాంతులకు గురిచేస్తున్నారు.

వందలాది ఎకరాల ప్రభుత్వ భూములను రియల్‌ఎస్టేట్ వ్యాపారులు ఆక్రమించి భూదందాలు చేస్తున్నా పట్టించుకోని అధికారులు, పేదలు తలదాచుకోవడానికి 60 గజాల్లో గుడిసెలు వేసుకుంటే వందలాది మంది పోలీసుతో దాడులు చేయడం సరైందికాదు. తక్షణమే వీరికి న్యాయం చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) డిమాండ్ చేస్తున్నది.

(తమ్మినేని వీరభద్రం)
రాష్ట్ర కార్యదర్శి